# ఆదిలాబాద్ వార్త

మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్

బుధవారం 31, డిసెంబర్ 2025




## లంచం తీసుకుంటూ..
# ఏసీబీకి చిక్కిన సర్వేయర్

నిర్మల్‌రూరల్, డిసెంబర్ 30, ప్రభాతవార్త

నిర్మల్‌లో అవినీతి నిరోధక శాఖ అధికారులు ల్యాండ్ సర్వేయర్ లంచం తీసుకుంటుండగా పట్టుకున్నారు. నిర్మల్ రూరల్ మండలం కొండాపూర్ గ్రామానికి చెందిన చిన్నయ్య అనే వ్యక్తి భూమి కొలత నిమిత్తం ల్యాండ్ సర్వేయార్ బాలకృష్ణను సంప్రదించగా 15000 డిమాండ్ చేసి, 5000 అడ్వాన్స్ తీసుకొని మిగతా పదివేలకు డిమాండ్ చేయడంతో బాధితుడు పదివేల నుండి తక్కువ చేయాలని కోరడంతో 7500 రూపాయలకు అంగీకరించారు. ఈ విషయం బాధితుడు ఏసీబీ అధికారులకు చెప్పడంతో సర్వేయర్ బాలకృష్ణ, అసిస్టెంట్ నాగరాజులు లంచం తీసుకుంటుండగా మంగళవారం సాయంత్రం రెడ్ హ్యాండెడ్ గా పట్టుకొని ఎమ్మార్వో కార్యాలయంలోకి తరలించి పంచనామ చేశారు. ఈ సందర్భంగా ఏసీబీ డిఎస్పి మధు మాట్లాడుతూ లంచం తీసుకొని పట్టుబడినవి ఇద్దరికీ జ్యూడిషల్ రిమాండ్ పంపినట్లు తెలిపారు. అవినీతికి ఎవరు పాల్పడిన తమను సంప్రదించాలని కోరారు.

## శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై
# చట్టపరమైన చర్యలు తీసుకోవాలి

★ ఎస్పీ నితికా పంత్ ★ ఈస్‌గాం, పెంచికల్ పేట్, దహెగాం పోలీస్‌స్టేషన్‌ల ఆకస్మిక తనిఖీ

కాగజ్‌నగర్ రూరల్, డిసెంబర్ 30, ప్రభాతవార్త

శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, పోలీస్ అధికారులు, సిబ్బంది విధి నిర్వహణలో ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ నితికా పంత్ సూచించారు. మంగళవారం కాగజనగర్ డిఎస్పీ వాహిదుద్దీన్‌తో కలిసి ఈస్ గాం, పెంచికల్ పేట్, దహెగాం పోలీస్ స్టేషన్‌లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్ పరిసరాలు, నమోదు చేసిన రికార్డులు, పెండింగ్ కేసుల పురోగతి, స్టేషన్ హాజరు రిజిస్టర్, స్టేషన్ శుభ్రత తదితర విభాగాలను పరిశీలించారు. ఎస్‌హెచ్‌ఓ లతో, స్టేషన్ సిబ్బందితో సమావేశమై పలు సూచనలు చేశారు. శాంతి భద్రతల పరిరక్షణలో ప్రతి పోలీసు సిబ్బంది ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని అన్నారు. గ్రామాల్లో చట్టవ్యతిరేకచర్యలు, అసాంఘిక కార్యకలాపాలు, అక్రమ రవాణా, మాదకద్రవ్యాలపై దృష్టి సారించాలని ఆదేశించారు. స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుదారుడితో, ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని అన్నారు. మహిళలు, బాలికల భద్రతకు సంబంధించిన కేసుల్లో ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, లా అండ్ ఆర్డర్ విషయంలో రాత్రిపూట పర్యవేక్షణ, ప్యాట్రోలింగ్‌ను కచ్చితంగా కొనసాగించాలని సూచించారు. అసాంఘిక కార్యక్రమాలు, మత్తు పదార్థాల నివారణకు కృషి చేయాలని అన్నారు. ప్రజాభద్రతకు విఘాతం కలిగించే వారిపై కఠినంగా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లా ఎస్పీ వెంట ఆయా పోలీస్ స్టేషన్‌ల ఎస్సైలు ఉన్నారు.



# జంగుబాయి దేవాలయ అభివృద్ధికి చర్యలు తీసుకుంటాం



✤ ఆదిలాబాద్ పార్లమెంట్ సభ్యుడు గొడం నగేష్

కెరమెరి, డిసెంబర్ 30, ప్రభాతవార్త

జంగుబాయి దేవాలయ అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని ఆదిలాబాద్ పార్లమెంట్ సభ్యుడు గొడం నగేష్ అన్నారు. మంగళవారం జిల్లాలోని కెరమెరి మండలం కోటపరంధోలి గ్రామంలో నిర్వహించిన జంగుబాయి జాతరలో జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే, జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారి, ఆసిఫాబాద్ నియోజకవర్గ శాసనసభ్యులు కోవ లక్షి ్మ, మహారాష్ట్ర లోని యావత్ మాల్ నియోజకవర్గ శాసనసభ్యులు తొడసం రాజులతో కలిసి ఆలయ క్షేత్రాన్ని సందర్శించి జంగుబాయి దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదిలాబాద్ పార్లమెంటు సభ్యులు మాట్లాడుతూ పవిత్రమైన పుష్య మాసంలో జంగుబాయి మిగతా 2లో..

## రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో
# ఉమ్మడి ఆదిలాబాద్ జట్టుకు స్వర్ణ పతకం

✦ నస్పూర్ విద్యార్థిని దేవర్షిణికి ఘన సన్మానం

✦ అభినందించిన జిల్లా విద్యాశాఖాధికారి

– నస్పూర్, డిసెంబర్ 30, ప్రభాతవార్త



8లో..

# సదర్మాట్ బ్యారేజీ నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలి



★ నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్‌రూరల్, డిసెంబర్ 30, ప్రభాతవార్త

మిగిలి ఉన్న సదర్మాట్ బ్యారేజీ నిర్మాణ పనులన్నింటినీ వెంటనే పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం మామడ మండలం పొన్కల్ గ్రామంలో నిర్మిస్తున్న సదర్మాట్ బ్యారేజీ నిర్మాణ పనులను కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా బ్యారేజీ నిర్మాణ పనులను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ మాట్లాడుతూ, సదర్మాట్ బ్యారేజీ నిర్మాణం దాదాపు పూర్తి అయిపోయిందని తెలిపారు. మిగిలి ఉన్న చిన్న చిన్న పనులన్నింటినీ వెంటనే మిగతా 2లో..

## విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో
# విద్యాబోధన చేయాలి

✪ మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్

బెల్లంపల్లి, డిసెంబర్ 30, ప్రభాతవార్త

ప్రభుత్వ పాఠశాలలలో చదువుతున్న విద్యార్థినీ విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో ఉపాధ్యాయులు విద్యా బోధన చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లాలోని బెల్లంపల్లి మండల కేంద్రంలో గల కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి పాఠశాల పరిధిలో కొనసాగుతున్న మిగతా 2లో..






## వార్డుల వారీగా మ్యాపింగ్ ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలి

### - రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని

**నస్పూర్, డిసెంబర్ 30, ప్రభాతవార్త**

రాష్ట్రంలోని మున్సిపాలిటీలలో వార్డుల వారీగా ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని అన్నారు. మంగళవారం హైదరాబాద్ నుండి ఇతర ఎన్నికల అధికారులతో కలిసి వీడియోకాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల అదనపు కలెక్టర్లు, మున్సిపల్ కమిషనర్లు, ఎన్నికల విభాగం అధికారులతో ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఎన్నికల మాట్లాడుతూ మున్సిపాలిటీల పరిధిలోని వార్డులలో ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలని తెలిపారు. భారత ఎన్నికల సంఘం అందించిన ఓటర్ల జాబితాను టి ఈ పోల్ పోర్టల్‌లో అందుబాటులో ఉంచడం జరిగిందని, అసెంబ్లీ నియోజకవర్గాల పోలింగ్ కేంద్రాల వారిగా ఓటరు జాబితా ఉంటుందని, మున్సిపల్ కమిషనర్లు తమ వివరాలతో లాగిన్ తీసుకొని వారికి సంబంధించిన మున్సిపల్ ఓటర్లను వార్డుల వారి మ్యాపింగ్ చేయాలని తెలిపారు. మున్సిపల్ పరిధిలో పోలింగ్ కేంద్రాల మ్యాపింగ్ చేపట్టాలని, ఈ ప్రక్రియలో ఏమైనా సందేహాలు ఉన్నట్లయితే సంబంధిత నోడల్ అధికారి ద్వారా నివృత్తి చేసుకోవాలని తెలిపారు. జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి. చంద్రయ్య మాట్లాడుతూ జిల్లాలో మున్సిపల్ కార్పొరేషన్, మున్సిపాలిటీలలో ఓటర్ మ్యాపింగ్ ప్రక్రియ ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ విలయత్ అలీ, మున్సిపల్ కమిషనర్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలి

(మొదటిపేజీ తరువాయి)

అదనపు గదుల నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థులకు సకల సౌకర్యాలతో కూడిన నాణ్యమైన విద్యను అందించేందుకు అన్ని ప్రభుత్వ పాఠశాలలలో త్రాగునీరు, విద్యుత్, విద్యార్థినీ విద్యార్థులకు వేరువేరుగా మూత్రశాలలు, వంటశాల, ప్రహరీ గోడ ఇతర మౌలిక సదుపాయాలు కల్పించడం జరుగుతుందని తెలిపారు. నిష్ణాతులైన ఉపాధ్యాయులను నియమించి నాణ్యమైన విద్య బోధన అందించడం జరుగుతుందని తెలిపారు. అభివృద్ధి పనులలో భాగంగా చేపట్టిన అదనపు గదుల నిర్మాణ పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. మధ్యాహ్న భోజనం తయారీలో పరిశుభ్రత నిబంధనలు పాటించాలని, తాజా కూరగాయలు, నాణ్యమైన నిత్యవసర సరుకులను వినియోగించాలని, మెనూ ప్రకారం సకాలంలో విద్యార్థులకు పౌష్టిక ఆహారం అందించి వారి ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. పాఠశాలలోని వంటశాల, తరగతి గదులు, పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంలో పాఠశాలలో ఇంటర్మీడియట్ విద్యార్థులకు మ్యాథ్స్ సబ్జెక్టులో పాఠ్యాంశాలు బోధించి విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాలను పరీక్షించారు. అనంతరం రామ్ నగర్ ప్రాంతంలో నూతనంగా నిర్మిస్తున్న ప్రీ ప్రైమరీ పాఠశాల నిర్మాణ పనులను పరిశీలించి త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

## సదర్మాట్ బ్యారేజీ నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలి

(మొదటిపేజీ తరువాయి)

పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ బ్యారేజీ వినియోగంలోకి వస్తే దాదాపు 18 వేల ఎకరాలకు సాగు నీరు అందుతుందని పేర్కొన్నారు. రైతులకు ఎంతో ఉపయోగకరం అని వివరించారు. ఆయకట్టు రైతులకు అధికారులు బ్యారేజీ నిర్మాణం, ఆయకట్టు వివరాలు మ్యాపుల ద్వారా వివరించారు. పలువురు స్థానిక రైతులతో కలెక్టర్ మాట్లాడారు. ఈ బ్యారేజీ పరిశీలనలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, ఆర్డీఓ రత్నకళ్యాణి, తహసిల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో సుశీల్, ఇంజనీరింగ్, నీటిపారుదల శాఖల అధికారులు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# జంగుబాయి దేవాలయ అభివృద్ధికి చర్యలు తీసుకుంటాం

(మొదటిపేజీ తరువాయి)



క్షేత్రంలో నిర్వహిస్తున్న జాతరకు తెలంగాణ, మహారాష్ట్ర, చత్తీస్ ఘడ్ రాష్ట్రాల నుండి పెద్ద సంఖ్యలో భక్తులు వస్తారని, తదనగుణంగా క్షేత్రంలో జాతర ఏర్పాట్లు చేయాలని తెలిపారు. జంగుబాయి దేవతను భక్తితో కొలుస్తారని, ప్రకృతి ఒడిలో సహజ సిద్ధంగా జంగుబాయి దేవత కొలువై ఉందని తెలిపారు. గిరిజనులు తమ సంస్కృుృతి, సంప్రదాయాలను కాపాడుకోవాలని, భవిష్యత్తు తరాలకు అందించాలని, వచ్చే రోజులలో జంగుబాయి క్షేత్రంలో అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. రహదారి సౌకర్యం, ఆలయ క్షేత్రం చుట్టూ ప్రహరీ నిర్మాణం, విద్యుత్ సౌకర్యం కల్పించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని, త్రాగునీటి వసతి కల్పిస్తామని తెలిపారు. జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే మాట్లాడుతూ జంగు భాయ్ ఉత్సవాలకు ప్రభుత్వం ద్వారా ఏర్పాట్లు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని, దర్శనానికి వచ్చే భక్తులకు మరుగుదొడ్లు, మూత్రశాలలు, స్నానపు గదులు, రహదారి, ప్రహరీ నిర్మాణం, లైటింగ్ ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ఆసిఫాబాద్ శాసనసభ్యులు మాట్లాడుతూ వందల సంవత్సరాల చరిత్ర కలిగిన జంగుబాయి దేవస్థానం అభివృద్ధికి కట్టుబడిఉన్నామని తెలిపారు. మహారాష్ట్రలోని యవత్ మాల్ శాసనసభ్యులు మాట్లాడుతూ జంగుబాయి దేవస్థానం అభివృద్ధికి ఇరు రాష్ట్రాల అధికారులు, ప్రజా ప్రతినిధులతో సమావేశం నిర్వహించి ఆలయ అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆలయ అభివృద్ధికి కృషి చేయాలని ఉత్సవ కమిటీ సభ్యులు, ప్రజా ప్రతినిధులు, అధికారులకు వినతిపత్రం సమర్పించారు. అనంతరం ఆదిలాబాద్ పార్లమెంటు సభ్యులు మార్లవాయిలు జరిగే హైమన్ డార్ఫ్ వర్ధంతి కార్యక్రమ సంబంధిత కరపత్రాలను ఆవిష్కరించారు. అంతకు ముందు కటోడీలు జాతరకు విచ్చేసిన అతిథులకు సాంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో జంగుబాయి ఉత్సవ కమిటీ చైర్మన్ సలాం శ్యామ్ రావు, అధ్యక్షులు కొడప జాకు, ఆసిఫాబాద్ రాజస్వ మండలాధికారి లోకేశ్వర్ రావు, జిల్లా పంచాయతీ అధికారి బిక్షపతి, జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి రమాదేవి, సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోండి

**వేమనపల్లి, డిసెంబర్ 30, ప్రభాతవార్త**



టీబీ ముక్త్ భారత్ అభియాన్ శిబిరాన్ని సద్వినియోగం చేసుకొని టీబీ వ్యాధి బారిన పడకుండా జాగ్రత్త పడాలని కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ సత్తయ్య, జిల్లా హెల్త్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ సురేందర్ తెలిపారు. ప్రధాన మంత్రి టిబి ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంను జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ వారి ఆధ్వర్యంలో వైద్య శిబిరంను మంగళవారం నీల్వాయి రైతు వేదికలో మాజీ జడ్పీటీసీ ఆర్. సంతోష్ కుమార్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సయ్యద్ సాబీర్ అలీతో కలిసి టీబీ వ్యాధి నివారణకై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ రెండు వారాలకు పైగా దగ్గు లక్షణాలు ఉంటే క్షయ వ్యాధిగా అనుమానించాలన్నారు. జిల్లాలోని ప్రతి ఆరోగ్య కేంద్రంలో వ్యాధి నిర్ధారణ తెమడ పరీక్షలు ఉచితంగా చేస్తున్నారని, క్షయ వ్యాధి నిర్ధారణ జరిగితే ఉచితంగా చికిత్స అందిస్తూ, చికిత్స పూర్తయ్యే వరకు ప్రతినెల 1000 చొప్పున పోషణ భత్యాన్ని ప్రభుత్వం అందిస్తుందని వారు తెలిపారు. వ్యాధి నిరోధక శక్తి తక్కువ ఉన్నవారికి ఈ వ్యాధి తొందరగా వ్యాపిస్తుందని, అందుకు అన్ని రకాల పోషకాహారాలు దొరికే ఆహారాన్ని తీసుకోవడం ఉత్తమ మార్గం అన్నారు. సత్వరమే వ్యాధి నిర్ధారణ జరిగి చికిత్స ప్రారంభించి వ్యాధి వ్యాప్తిని అరికట్టవచ్చు అని తెలిపారు. తుంపర్ల ద్వారా ఒకరి నుంచి ఇంకొకరికి వ్యాప్తి చెందే ఈ వ్యాధి మద్యం సేవించే వారికి పొగాకు నమిలే వారికి సోకే ప్రమాదం ఎక్కువగా ఉంటుందని తెలిపారు. ఈ శిబిరంలో అవసరం ఉన్నవారికి అన్ని రకాల పరీక్షలు చేశారు. అలాగే ఎక్స్ రే అవసరం ఉన్నవారికి గ్రామంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరం వద్దనే పోర్టబుల్ ఎక్స్ రే ద్వారా ఎక్స్ రే తీయడం జరిగింది. ఈ కార్యక్రమంలో డా. అన్వేష్, స్థానిక సర్పంచ్ చెన్నూరి సమ్మయ్య, ఉప సర్పంచ్ కాయిత శోభా తిరుపతి, హెల్త్ ఎక్స్టెన్షన్ ఆఫీసర్ శ్రీనివాస్, ఎక్స్ రే టెక్నీషియన్ అజయ్, సబ్ సెంటర్‌సూపవైజర్స్ అపరంజి, రాంశెట్టి బాపు, ఎంఎల్ హెచ్ పిలు కీర్తి, మానస, శ్రీవాణి, తేజస్వి, ఏఎన్ఎం విజయలక్ష్మి, ఉమాదేవి కళావతి హెచ్‌ఏ షణ్ముఖ చారీ ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# కోతుల బెడద నివారణకు చర్యలు

### ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటున్న డిసిసి ఉపాధ్యక్షుడు, సర్పంచ్

**తాండూర్, డిసెంబర్ 30, ప్రభాతవార్త :**


కోతులను బోనులో బంధించిన దృశ్యం

తాండూర్ మండలం మాదారం గ్రామ పంచాయతీలో కోతుల బెడద నివారణకు మంచిర్యాల జిల్లా కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షుడు సూరం రవీందర్ రెడ్డి ఆధ్వర్యంలో సర్పంచ్ కుశ్నపల్లి లక్ష్మీనారాయణ చర్యలు చేపట్టారు. మాదారంలోని సింగరేణి కమిటీ హాల్లో కోతులను బంధించేందుకు మంగళవారం బోనులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డిసిసి ఉపాధ్యక్షులు రవీందర్ రెడ్డి మాట్లాడుతూ మాదారం టౌన్షిప్ లో ఎన్నో రోజుల నుండి స్థానికులు కోతుల వలన చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. సర్పంచ్ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన మాదారం సర్పంచ్ అభ్యర్థి లక్ష్మీనారాయణను గెలిపిస్తే కోతుల బెడతను అరికడతామని హామీ ఇచ్చామన్నారు. కోతుల బెడతను అరికట్టకపోతే ఎంపిటిసి ఎన్నికలలో ఓట్లు అడగమని ప్రకటించామన్నారు. ఎన్నికలలో ఇచ్చిన హామీ మేరకు కోతులను బోనులలో బంధించి నీరు ఉన్న అటవీ ప్రాంతంలో సురక్షితంగా వదిలి పెడతామన్నారు. ఎన్నికలలో ఇచ్చిన హామీ మేరకు కోతులు బెడత నివారణకు చర్యలకు ఉపక్రమించిన కాంగ్రెస్ పార్టీ నేతలను, సర్పంచును స్థానికులు అభినందించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ సూరం దామోదర్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు జే.రమేష్, సాయి, రంగ రవి, బాణేష్, క్రిష్ణ, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ప్రారంభమైన సింగరేణి కంపెనీ స్థాయి క్రీడా పోటీలు

## క్రీడలతోనే శారీరక, మానసిక ఆరోగ్యం - శ్రీరాంపూర్ జీఎం మునిగంటి శ్రీనివాస్



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న జీఎం శ్రీనివాస్




మాట్లాడుతున్న శ్రీరాంపూర్ జీఎం శ్రీనివాస్

**నస్పూర్, డిసెంబర్ 30, ప్రభాతవార్త**

శ్రీరాంపూర్ ఏరియాలోని శాంతి మైదానంలో వర్క్స్ పీపుల్స్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సింగరేణి కంపెనీ స్థాయి అథ్లెటిక్స్, త్రోబాల్, స్విమ్మింగ్ క్రీడా పోటీలు మంగళవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ మునిగంటి శ్రీనివాస్ ముఖ్య అతిథిగా విచ్చేసి, ఒలింపిక్ పతాకాన్ని ఆవిష్కరించి అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా జనరల్ మేనేజర్ మాట్లాడుతూ.. సింగరేణి సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగులు తమ రోజువారీ విధి నిర్వహణలో నిమగ్నమవుతూనే, క్రీడల్లో చురుకుగా పాల్గొనడం అభినందనీయమన్నారు. క్రీడల ద్వారా శారీరక దారుఢ్యంతో పాటు మానసిక ఉల్లాసం లభిస్తుందని, ఇది సంస్థలో ఆరోగ్యవంతమైన పని వాతావరణానికి దోహదపడుతుందని పేర్కొన్నారు. ఇక్కడ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు జాతీయ స్థాయి పోటీల్లో పతకాలు సాధించి, సింగరేణి సంస్థ కీర్తి ప్రతిష్టలను ఇనుమడింపజేయాలని ఆయన ఆకాంక్షించారు. సింగరేణి యాజమాన్యం క్రీడాకారుల ప్రోత్సాహం కోసం మైదానాలు, స్టేడియంలు, సీఈఆర్ క్లబ్‌లు, స్విమ్మింగ్ పూల్స్ వంటి అత్యాధునిక మౌలిక సదుపాయాలను కల్పించిందని జీఎం తెలిపారు. యువ క్రీడాకారులు వీటిని సమర్థవంతంగా వినియోగించుకొని క్రీడారంగంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. ఈ క్రీడా పోటీల్లో భాగంగా మహిళలకు ప్రత్యేకంగా త్రోబాల్, రన్నింగ్, త్రోస్, లాంగ్ జంప్ పోటీలను నిర్వహించారు. పురుషుల విభాగంలో రన్నింగ్, లాంగ్ జంప్, త్రోస్, స్విమ్మింగ్ పోటీలను ఏర్పాటు చేశారు. వివిధ ఏరియాల నుండి తరలివచ్చిన క్రీడాకారులు ఉత్సాహంగా పోటీ పడుతున్నారు. ఈ కార్యక్రమంలో ఎస్వోటు జీఎం, స్పోర్ట్స్ వైస్ ప్రెసిడెంట్ ఎన్. సత్యనారాయణ, గుర్తింపు సంఘం అసిస్టెంట్ బ్రాంచ్ సెక్రటరీ మోత్కూరి కొమురయ్య, డీజీఎం (పర్సనల్), చీఫ్ కోఆర్డినేటర్ ఎస్. అనిల్ కుమార్, ఆర్.కె 5 గని ఏజెంట్ శ్రీధర్, డిప్యూటీ సిఎంఓ డాక్టర్ పి. రమేష్ బాబు, స్పోర్ట్స్ సెక్రటరీ సృజన్ పాల్, స్పోర్ట్స్ సూపర్వైజర్ చాట్ల అశోక్, జాన్ వెస్లీ, పర్సా శ్రీనివాస్, ఎం. నరేందర్ రెడ్డి, సిహెచ్ రమేష్, కోఆర్డినేటర్ ఎస్. నరసయ్య, జనరల్ కెప్టెన్ శ్రీనివాస్, ఇండోర్ కెప్టెన్ తోట సురేష్, వివిధ ఏరియాల కోఆర్డినేటర్లు, క్రీడాకారులు పాల్గొన్నారు.

## కుంటాల(కే) సర్పంచ్ బిఆర్ఎస్‌లో చేరిక

**నేరడిగొండ, డిసెంబర్ 30, ప్రభాతవార్త:**




నేరడిగొండ మండలంలోని కుంటాల(కే) గ్రామ సర్పంచ్ ఆత్రం గంగారాం బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ నాయకత్వంలో తెలంగాణ భవన్‌లో బిఆర్ ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేతుల మీదుగా పార్టీ కండువా కప్పుకున్నారు. అనంతరం బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర భవిష్యత్తు బిఆర్ఎస్‌కే చెందుతుందని అన్నారు. రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా పార్టీ ముందుకు సాగుతుందని తెలిపారు. బిఆర్ఎస్‌లో చేరిన వారిలో కుంటాల(కే) సర్పంచ్ ఆత్రం గంగారాం, ఉప సర్పంచ్ లక్ష్మణ్, మాజీ సర్పంచ్ ప్రభు, గ్రామ పటేల్ సిడం చిన్న గంగారాం, పెందుర్ అనిల్ కుమార్, సిడం ఈశ్వర్, గెడం భూమన్న ఉన్నారు. గ్రామ స్థాయిలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని వారు ఈ సందర్భంగా పేర్కొన్నారు.

## ఎన్నికల పైన అవగాహన కల్పించిన ఉపాధ్యాయులు

**సారంగాపూర్, డిసెంబర్ 30, ప్రభాతవార్త:**

మండలంలోని కౌట్ల(బి) నేతాజీ పబ్లిక్ స్కూల్‌లో మంగళవారం ఉపాధ్యాయులు ఎన్నికల విధానంపై అవగాహన కల్పించారు. విద్యార్థులు అభ్యర్థులను గుర్తించి ఎవరెవరు ఏ అభ్యర్థికి ఓటును ఏ విధంగా వేయాలని మాక్ పోలింగ్ సమర్థవంతంగా నిర్వహించారు. విద్యార్థులు చక్కగా అవగాహన చేసుకుని మాక్ పోలింగ్ పాల్గొన్నారు. పిల్లలను ఉపాధ్యాయులు అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గంగాధర్, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.



ఎన్నికలపై అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

## నేడు ప్రత్యేక డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు

**తాండూర్, డిసెంబర్ 30, ప్రభాతవార్త :**




డిసెంబర్ 31న రెబ్బెన పోలీస్ స్టేషన్ పరిధిలో స్పెషల్ డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించనున్నట్లు ఎస్ఐ వెంకటకృష్ణ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ 4 ప్రత్యేక బృందాలతో స్పెషల్ డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తామన్నారు. డీజేలు, పెద్ద పెద్ద సౌండ్ తో కూడిన మైక్ లను ఏర్పాటు చేసి ఇతరులకు ఇబ్బంది కలిగించిన,రోడ్లపై కేకులు కట్ చేయడం, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం, కూడళ్ల వద్ద చలి మంటలు వేయటం వంటివి నిషేధమన్నారు. ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు.



## బొక్కివాగు ప్రాజెక్టులో చేప పిల్లల విడుదల

**పెంచికల్ పేట్, డిసెంబర్ 30, ప్రభాతవార్త**

మత్స్యకారులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని జిల్లా మత్స్యశాఖ ఫీల్డ్ అధికారి మధుకర్ అన్నారు. మంగళవారం పెంచికల్ పేట్ మండలంలోని బొక్కివాగు ప్రాజెక్ట్ లో ప్రభుత్వం అందిస్తున్న ఉచిత చేప పిల్లలను అయన విడుదల చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ప్రభుత్వం అందజేస్తున్న ఉచిత చేప పిల్లలను మత్స్యకారులు సద్వినియోగం చేసుకోవాలని, సరైన దానా వేసి చేపల పెంపకాన్ని అభివృద్ధి చేసి మంచి లాభాలు పొందాలని అన్నారు. మొత్తం 240000 రెండు లక్షల నలభై వేల చేప పిల్లలను విడుదల చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ ఆల్బర్ట్, సర్పంచులు చప్పిడి రవి, భక్తు రాంచంధర్, మత్స్య సంఘం అధ్యక్షుడు బాపూరావు, సభ్యులు బాబాజీ, సుధాకర్, శ్రీనివాస్, కార్యదర్శులు చంద్రశేఖర్, చంద్రయ్య, నాయకులు చప్పిడి సత్యనారాయణ, వెంకటి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న తాహశీల్దార్ శ్రీనివాస్

## తిర్యానిలో పౌర హక్కుల దినోత్సవం

**తిర్యాని, డిసెంబర్ 30, ప్రభాతవార్త**

మండలంలోని గంభీరావుపేట గ్రామ పంచాయతీలో తాహశీల్దార్ ఆర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో మంగళవారం పౌర హక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సూచన మేరకు ప్రతినెల 30వ తేదీన మండలంలో పౌర హక్కుల దినోత్సవం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. అంటరానితనాన్ని రూపుమాపడానికి సమాజంలో అసమానతలను తొలగించడానికి ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. ప్రతి పౌరుడు సమాన హక్కులతో జీవించే సమాజ నిర్మాణమే లక్ష్యంగా ప్రభుత్వాలు ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నాయని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ జిమ్మిడి కిష్టయ్య, ఉపసర్పంచ్ రాజకుమారి, ఆర్ఐ శ్రీనివాస్, గ్రామస్తులు పాల్గొన్నారు.



గొర్రెలకు నట్టల నివారణ మందులను పంపిణి చేస్తున్న దృశ్యం

## సుంగాపూర్‌లో నట్టల నివారణ మందుల పంపిణీ

**తిర్యాని, డిసెంబర్ 30, ప్రభాతవార్త**

తిర్యాని మండలంలోని సుంగాపూర్ గ్రామంలో గొర్రెలకు,మేకలకు నట్టల నివారణ మందులను తిర్యాని పశువైద్యశాల ఆధ్వర్యంలో పంపిణి చేశారు. ఈ సందర్భంగా పశు వైద్యాధికారి ఎస్ సాగర్ మాట్లాడుతూ గొర్రెల, మేకల ఆరోగ్య పరిరక్షణ కోసం పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని రైతులందరూ ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.అనంతరం 487 గొర్రెలకు, 337 మేకలకు నట్టల నివారణ మందులను పంపిణి చేశారు.ఈ కార్యక్రమములో సుంగాపూర్ సర్పంచ్ టేకం సురేష్, ఉప సర్పంచ్ గడ్డి హారిక ,పశువైద్య సిబ్బంది సురేష్, మనోహర్, రాకేష్, సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడి కేంద్రాలకు ఉచిత విద్యుత్ మీటర్లు

**తిర్యాని, డిసెంబర్ 30, ప్రభాతవార్త;**

తిర్యాని మండలంలో నీతి అయోగ్, డిఎం జుగా కార్యక్రమంలో భాగంగా మండలంలోని 38 అంగన్వాడి కేంద్రాలకు ఉచిత విద్యుత్ మీటర్లను అమర్చుతున్నట్లు తిర్యాని విద్యుత్ శాఖ ఏఈ రవీందర్ తెలిపారు. మంగళవారం మండలంలోని అంగన్వాడి కేంద్రాల్లో విద్యుత్ మీటర్లను అమర్చారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్వాడి కేంద్రాలతో పాటు మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు విద్యుత్ మీటర్లు బిగిస్తామన్నారు. ఎక్కడైతే అవసరం ఉందో వారు తమ దృష్టికి తీసుకురావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో కన్స్ట్రక్షన్ ఏఈ శ్రీకాంత్, లైన్‌మెన్ నిరంజన్, విద్యుత్ సిబ్బంది ఉన్నారు.



అంగన్వాడి కేంద్రంలో విద్యుత్ మీటర్ ను అమర్చుతున్న దృశ్యం

# వార్డుల వారీగా ఓటరు జాబితా ప్రక్రియ వేగవంతం చేయాలి

**- మంచిర్యాల జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్**

**నస్పూర్, డిసెంబర్ 30, ప్రభాతవార్త**

జిల్లాలోని మున్సిపల్ కార్పొరేషన్, మున్సిపాలిటీల పరిధిలో గల వార్డుల వారీగా ఓటర్ల జాబితా ప్రక్రియ వేగవంతం చేయాలని మంచిర్యాల జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ ఛాంబర్‌లో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి. చంద్రయ్య, బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్, డిప్యూటీ కలెక్టర్ మహమ్మద్ వలియత్ అలీలతో కలిసి కలెక్టరేట్ పరిపాలన అధికారి పిన్న రాజేశ్వర్, మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్, జిల్లాలోని మున్సిపల్ కమిషనర్లు, పట్టణ ప్రణాళిక అధికారులతో వార్డుల వారీగా ముసాయిదా ఓటరు జాబితా, పోలింగ్ కేంద్రాల గుర్తింపు పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మాట్లాడుతూ మున్సిపాలిటీల పరిధిలో వార్డుల



వారీగా ఓటర్ల జాబితా ఎలాంటి అవకతవకలకు తావు లేకుండా స్పష్టంగా రూపొందించాలని తెలిపారు. వార్డులలో నివాస ప్రాంతాలకు సమీపంలో పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు మంచి ప్రాంతాలను గుర్తించాలని, పోలింగ్ కేంద్రంలో 800 మంది ఓటర్లకు మించి ఉండకుండా ప్రతిపాదనలు సిద్ధం చేసి సమర్పించాలని తెలిపారు. జనవరి 1, 2026 నాడు పోలింగ్ కేంద్రాల వారీగా ముసాయిదా జాబితా తయారు చేయాలని తెలిపారు. మున్సిపాలిటీల పరిధిలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తిచేసే విధంగా అధికారులు పర్యవేక్షించాలని తెలిపారు. అంతర్గత రహదారులు, మురుగు కాలువల పనులను త్వరగా పూర్తి చేయాలని, వేసవిలో త్రాగునీటికి సమస్య రాకుండా నిరంతరం ప్రతి నివాసానికి త్రాగునీరు అందించేందుకు ముందస్తు కార్యచరణ రూపొందించాలని తెలిపారు. పారిశుద్ధ్య పనులు పకడ్బందీగా చేపట్టాలని, సంబంధిత అధికారులు నిరంతరం పనులను పర్యవేక్షించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



విశ్వనాథ ఆలయంలో పూజలో పాల్గొన్న మంచిర్యాల శాసనసభ్యులు

## పూజల్లో పాల్గొన్న శాసనసభ్యుడు

**మంచిర్యాల, డిసెంబర్ 30, ప్రభాతవార్త**

మంచిర్యాల పట్టణంలోని విశ్వనాథ ఆలయంలో ప్రత్యేక పూజ చేసిన మంచిర్యాల శాసనసభ్యులు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు, మంచిర్యాల జిల్లా మాజీ డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ దంపతులు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు మాట్లాడుతూ ఈ ముక్కోటి ఏకాదశి వెంకటేశ్వర స్వామి ఆశీస్సులతో మంచిర్యాల నియోజకవర్గంలో పాడి పంటలతో రైతులు, ప్రజలందరూ ఆయురారోగ్యాలతో సుఖ సంతోషాలతో ఉండాలని ఆ దేవుడిని కోరారు. ఈ కార్యక్రమంలో తాజా మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, మహిళా నాయకురాలు, యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## ఛత్రపతి శివాజీ విగ్రహ ప్రతిష్టాపనకు శంకుస్థాపన

**బెల్లంపల్లి, డిసెంబర్ 30, ప్రభాతవార్త**

మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి మండలంలోని చంద్రవెల్లి గ్రామంలో హిందూ సామ్రాట్ ఛత్రపతి శివాజీ విగ్రహ ప్రతిష్టాపనకు భూమి పూజ చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గ్రామ సర్పంచ్ చిలుముల శ్రీనివాస్, హిందూ ఉత్సవ సమితి బెల్లంపల్లి పట్టణ అధ్యక్షులు కట్టేవాడ నాగేష్, ఉపసర్పంచ్ గజెల్లి రాజ్ కుమార్, సోమేశ్వర దేవాలయ అధ్యక్షులు పూదరి నాగేష్ గౌడ్ పాల్గొని చత్రపతి శివాజీ చిత్రపటానికి పూలమాల వేసి కొబ్బరికాయ కొట్టి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో విగ్రహ ప్రతిష్టాపన సభ్యులు కళ్యాణం గణేష్, గజెల్లి రఘు, దాసరి అచల్ గౌడ్, రంగ నాగరాజు, కొమ్మెర జనార్ధన్, మరియు గ్రామ వార్డు సభ్యులు ఏ.భాగ్యలక్ష్మి , కే.గంగా, జే.అన్నపూర్ణ, పి.రాజన్న, కే. అంజనీ కుమార్, రంగ నాగరాజు, గ్రామ పెద్దలు, మహిళలు, నాయకులు, యువకులు పాల్గొన్నారు.

## నూతన విధానాలపై ప్రతి ఉద్యోగి అవగాహన పెంచుకోవాలి

**- ఇంచార్జి జనరల్ మేనేజర్ మచ్చగిరి నరేందర్**

**బెల్లంపల్లి, డిసెంబర్ 30, ప్రభాతవార్త**

సింగరేణి మైనింగ్ రంగంలో వస్తున్న నూతన విధానాలు, సాంకేతికతపై ఉద్యోగులు ఎప్పటికప్పుడు అవగాహన పెంచుకోవాలని బెల్లంపల్లి ఏరియా ఇంచార్జి జనరల్ మేనేజర్ మచ్చగిరి నరేందర్ అన్నారు. మంగళవారం రోజున గనుల వృత్తి శిక్షణ కేంద్రంలో సింగరేణి పర్యవేక్షకులకు నిర్వహిస్తున్న స్ట్రక్చర్ ట్రైనింగ్ (నిర్మాణాత్మక శిక్షణ) తరగతులను ఆయన ప్రారంభించారు. 12 రోజుల పాటు శిక్షణ తరగతులు నిర్వహించనున్నారు. కొత్త ఆవిష్కరణలు, పరికరాల వినియోగం పై ప్రతి ఉద్యోగి అవగాహన పెంచుకొని ఉత్పత్తి, ఉత్పాదకత, రక్షణ విషయంలో అమలు చేసుకోవాలని ఇంచార్జి జిఎం మచ్చగిరి నరేందర్ అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓ టు జిఎం కే .రాజమల్లు, ఏంవిటిసి మేనేజర్ టి. మధుసుధన్, అసిస్టెంట్ శిక్షకులు రమేష్ తదితరులు పాల్గొన్నారు.






ఉదయాన్నే పూజకు హాజరైన భక్తులు

## ముక్కోటి ఏకాదశికి ఆలయాల్లో పోటెత్తిన భక్తులు

**బెజ్జూర్,డిసెంబర్ 30,ప్రభాతవార్త :**

బెజ్జూర్ మండల కేంద్రంలోని ఆలయాలు ముక్కోటి ఏకాదశి సందర్భంగా మంగళవారం భక్తులతో క్రిక్కిరిసాయి.భక్తులు బ్రహ్మీ ముహూర్తం నుంచే శ్రీ గోదాదేవి సమేత శ్రీ రంగనాయక స్వామి ఆలయంలో ఉత్తర ద్వార దర్శనం ప్రారంభించారు.పూజారులు ఉదయం స్వామివారికి జలాభిషేకం,పంచామృత స్నానం అనంతరం ప్రత్యేక అలంకరణ చేసి పూజలు నిర్వహించారు.పలు జిల్లాలతో పాటు మహారాష్ట్ర నుండి కూడా భక్తులు వచ్చి స్వామివారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ బండారి ప్రవీణ్ కుమార్, ఎంపీఓ శ్రీనివాస్,సర్పంచ్ దుర్గం సరోజ తిరుపతి,ఆలయ కమిటీ అధ్యక్షుడు తంగేడిపల్లి మహేష్,మాజీ అధ్యక్షుడు శ్రీ వర్ధన్,కొండ్ర జగ్గాగౌడ్,సుధాకర్ గౌడ్,కమిటీ సభ్యులు,పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.



భూమి పూజ చేస్తున్న సర్పంచ్

## ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి భూమి పూజ

**బెజ్జూర్,డిసెంబర్ 30,ప్రభాతవార్త :**

బెజ్జూర్ మండలంలోని మొగవెల్లి గ్రామపంచాయతీ దొడ్డిగూడ గ్రామానికి చెందిన ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారుని ఇంటి నిర్మాణానికి మంగళవారం సర్పంచ్ కొడప శంకర్ కొబ్బరికాయ కొట్టి భూమి పూజ చేశారు.ఈ సందర్భంగా పేదోడి సొంతింటి కల నెరవేర్చిన కాంగ్రెస్ ప్రభుత్వానికి కట్టుబడి ఉంటామని,విడతలవారీగా అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ఇండ్లు నిర్మిస్తామని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఆలం సీతారాం,పంచాయతీ కార్యదర్శి రాజేశ్వర్,వార్డ్ మెంబర్లు పాల్గొన్నారు.

## వైభవంగా ముక్కోటి ఏకాదశి వేడుకలు

**తాండూర్, డిసెంబర్ 30, ప్రభాతవార్త :**

రెబ్బెన మండలం గంగాపూర్ శ్రీ బాలాజీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం, మాదారం లోని శ్రీ కోదండ రామాలయంలో ముక్కోటి ఏకాదశి వేడుకలు మంగళవారం వైభవంగా జరిగాయి. మాదారం శ్రీ కోదండ రామాలయంలో శ్రీ సీతారాముల స్వామి వారికి ఆలయ అర్చకులు, వేద పండితులు ముద్దు అవధూత శర్మ, గంగాపూర్ లో అలివేలు మంగ, పద్మావతి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామికి ఆలయ అర్చకులు, వేద పండితులు ముద్దు దినేష్ శర్మ వేదమంత్రాలతో పంచామృత అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్తర ద్వారం నుంచి స్వామివార్లను భక్తులు దర్శించి మొక్కులు చెల్లించుకున్నారు.



గంగాపూర్ శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో భక్తుల సందడి

## పౌర హక్కులపై అవగాహన

**చింతలమానేపల్లి డిసెంబర్ 30, ప్రభాతవార్త :**

అంటరానితనం సామాజిక నేరం.. పౌర హక్కుల పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత" అనే నినాదంతో గంగాపూర్ గ్రామ పంచాయతీలో మంగళవారం పౌర హక్కుల అవగాహన సదస్సు ఘనంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ డోకె మధునక్క అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎంపీడీవో సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ రాజ్యాంగం కల్పించిన హక్కుల విషయంలో ప్రజలు ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడవద్దని పిలుపునిచ్చారు. హక్కుల కోసం చైతన్యంతో ముందుకు రావాలని, సామాజిక అసమానతలు తొలగినప్పుడే నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు. చట్టం ముందు అందరూ సమానులేనని, ఎక్కడైనా వివక్ష జరిగితే ధైర్యంగా అధికారులను సంప్రదించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఆర్ఐ రాజేష్, జూనియర్ అసిస్టెంట్ సందేశ్, పోలీసు సిబ్బంది, ఉపసర్పంచ్ జెల్ల నానయ్య, గ్రామ వార్డు సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



రాజ్యాంగ హక్కులపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న అధికారులు



## మండల సర్పంచ్‌ల ఫోరం ఏర్పాటు

### - సర్పంచుల ఫోరం అధ్యక్షుడిగా చెన్నూరి సమ్మయ్య

**వేమనపల్లి, డిసెంబర్ 30, ప్రభాతవార్త**

వేమనపల్లి మండల సర్పంచ్‌ల ఫోరం మండల కమిటీని మంగళవారం ఎన్నుకున్నారు. సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడిగా చెన్నూరి సమ్మయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సర్పంచులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని అన్నారు. తనకు సహకరించిన మాజీ జడ్పీటీసీ ఆర్. సంతోష్ కుమార్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సయ్యద్ సాబీర్ అలీ ఇరువురికి ప్రత్యేకంగా ధన్యవదములు తెలిపారు. ఉపాధ్యక్షులుగా వుప్పులపు సాయికృష్ణ, ప్రధాన కార్యదర్శిగా ఆయిల్ల శ్రీనివాస్, కోశాధికారి ఆవులమారి పున్నం, ప్రచార కార్యదర్శి కొండి మానస, సహాయ కార్యదర్శి అలం లక్ష్మణ్, కార్యనిర్వాహక సభ్యులు ముల్కల్ల శ్రీలత, దుర్గం భాగ్యలక్ష్మిలను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీలు ఆకుల లింగాగౌడ్, కుర్రు వెంకటేశం మండల యూత్ అధ్యక్షులు ముల్కల్ల సత్యనారాయణ,దుర్గం తిరుపతి, దందేర మహేష్, నాయకులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం ఎప్పటికప్పుడు పూర్తి చేస్తూ ఉండాలి

### - జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

**నిర్మల్‌రూరల్, డిసెంబర్ 30, ప్రభాతవార్త:**



జిల్లాలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం ఎప్పటికప్పుడు పూర్తి చేస్తూ ఉండాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం పురోగతిపై సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో భాగంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి అవసరమైన ఇసుక, ముడి సామాగ్రి, మ్యాన్ పవర్ అందుబాటులో ఉంచుకోవాలని పేర్కొన్నారు. ఇప్పటివరకు మండలాల్లో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి లభించిన అనుమతులు, వివిధ దశల వారిగా నిర్మాణం పూర్తయిన ఇండ్లకు సంబంధించి వివరాలను మండలాల వారిగా సమీక్షి ంచారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో ఎక్కడా కూడా ఇసుక కొరత తలెత్తకుండా అధికారులు తగు చర్యలు తీసుకోవాలని అన్నారు. ఎంపీడీవోలు ఎప్పటికప్పుడు ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులు పర్యవేక్షిస్తూ, నిర్మాణాలు త్వరితగతిన పూర్తయ్యేలా చొరవ చూపాలని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా హౌసింగ్ పిడి రాజేశ్వర్, ఎంపీడీవోలు, గృహ నిర్మాణ అధికారులు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ పోరాట వీరులకు పెన్షన్ ఇవ్వాలి

**బెల్లంపల్లి, డిసెంబర్ 30, ప్రభాతవార్త**

తెలంగాణ రాష్ట్ర టిపిసిసి అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్‌ను వారి నివాసములో కలిసి 1969లో తెలంగాణ ఉద్యమంలో పాల్గొని ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనకు పోరాటం చేసిన వీరులకు పెన్షన్ ఇవ్వాలని వినతిపత్రం అందజేశారు. ఇప్పుడు వారికి త్వరలో పెన్షన్ అందజేయాలని బెల్లంపల్లి మాజీ మున్సిపల్ చైర్మన్ మత్తమారి సూరిబాబు టిపిసిసి అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్‌ను కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో పోతరాజు శ్రీనివాస్, మత్తమారి శ్రీనివాస్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు కలిసి శాలువాతో సత్కరించి బెల్లంపల్లి రాజకీయాల గురించి చర్చించారు.



# వెల్లువెత్తిన ఆధ్యాత్మిక వైభవం

### సర్వాంగ సుందరంగా ముస్తాబైన వైష్ణవ ఆలయాలు - ఆలయాలు దర్శించుకున్న ప్రముఖులు

**మందమర్రి, డిసెంబర్ 30, ప్రభాతవార్త**



మందమర్రి పట్టణం వైకుంఠ ఏకాదశి పర్వదినాన ఆధ్యాత్మిక శోభతో వెల్లివిరిసింది. పట్టణంలోని స్థానిక వైష్ణవ దేవాలయాలన్నీ ఈ పర్వదినాన్ని పురస్కరించుకొని సర్వాంగ సుందరంగా అలంకరించబడ్డాయి. రంగురంగుల పూల అలంకరణలు, దీపాల కాంతులతో ఆలయ ప్రాంగణాలు భక్తులను ఆకట్టుకున్నాయి. వైకుంఠ ఏకాదశి సందర్భంగా స్వామివారి ఉత్తర ద్వార దర్శనానికి భక్తులు తెల్లవారుజాము నుంచే ఆలయాల వద్ద బారులు తీరారు. గోవిందా.. గోవిందా.. అనే నామస్మరణలతో ఆలయ పరిసరాలు మార్మోగాయి. చిన్నా-పెద్దా తేడా లేకుండా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులయ్యారు. ఉత్తర ద్వారమున దర్శనం చేసుకుంటే మోక్షప్రాప్తి కలుగుతుందనే విశ్వాసంతో భక్తులు అపారమైన శ్రద్ధతో స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అలంకార సేవలు ఘనంగా నిర్వహించబడాయి. భక్తుల సౌకర్యార్థం క్యూలైన్లు, దర్శన ఏర్పాట్లు క్రమబద్ధంగా చేపట్టగా, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా స్వచ్ఛంద సేవకులు సహకారం అందించారు. మొత్తం మీద వైకుంఠ ఏకాదశి పర్వదినం సందర్భంగా మందమర్రి పట్టణం ఆధ్యాత్మిక వెలుగులతో, భక్తి భావాలతో నిండిపోయింది. ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని మంచిర్యాల జిల్లా మందమర్రి పట్టణం భక్తిపారవశ్యంలో మునిగిపోయింది. ధనుర్మాస శుద్ధ ఏకాదశి సందర్భంగా స్థానిక ఆలయాలన్నీ భక్తులతో కిక్కిరిసిపోయాయి. తెల్లవారుజాము నుంచే భక్తులు శ్రీమన్నారాయణ స్మరణతో వైకుంఠ ద్వార దర్శనం కోసం పోటెత్తారు.

### ప్రముఖుల పూజలు-భక్తుల తాకిడి

మందమర్రిలోని ప్రసిద్ధ శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో నిర్వహించిన ఉత్తర ద్వార దర్శన వేడుకల్లో జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, డీసీపీ భాస్కర్, ఏసీపీ రవి కుమార్, సింగరేణి జీఎం రాధాకృష్ణ, ఎమ్మార్వో సతీష్ కుమార్, మున్సిపల్ కమిషనర్ రాజలింగు తమ కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొన్నారు. స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ వేడుకను కళ్లారా చూసేందుకు జిల్లా నుండే కాకుండా పొరుగు జిల్లాల నుండి కూడా సుమారు 30 వేల మంది భక్తులు తరలివచ్చారు. దాదాపు రెండు కిలోమీటర్ల మేర భక్తులు క్యూలైన్లలో గంటల తరబడి వేచి ఉండి స్వామివారిని దర్శించుకోవడం విశేషం. కట్టుదిట్టమైన ఏర్పాట్లుభక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆలయ కమిటీ మరియు పోలీసులు విస్తృత ఏర్పాట్లు చేశారు. పాలచెట్టు పంచముఖ ఆలయం, హరిహర పుత్ర అయ్యప్ప ఆలయాల్లో వైకుంఠ ద్వార దర్శనానికి ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశారు. శ్రీవారి సేవా సమితి ఆధ్వర్యంలో భక్తులకు తాగునీరు, టీ, ప్రసాద వితరణ చేశారు. వృద్ధులకు అసౌకర్యం కలగకుండా ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేపట్టారు. ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఏసీపీ రవి కుమార్ ఆదేశాల మేరకు సీఐ శశిధర్ రెడ్డి పర్యవేక్షణలో భారీ బందోబస్తు నిర్వహించారు. మందమర్రి, కాసిపేట, రామకృష్ణాపూర్, దేవపూర్ ఎస్సైలు, సింగరేణి సెక్యూరిటీ మరియు పోలీస్ సిబ్బంది నిరంతరం పహారా కాశారు. అధ్యాత్మిక శోభతో మందమర్రి పరిసర ప్రాంతాలన్నీ వైకుంఠాన్ని తలపించాయి.



## బెల్లంపల్లిలో క్రికెట్ లీగ్

### టోర్నమెంటులో ఎం.ఎం.సి.ఏ రైడర్స్ గెలుపు

**బెల్లంపల్లి, డిసెంబర్ 30, ప్రభాతవార్త**

మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి పట్టణంలోని ఏ.ఎం.సీ మైదానంలో నిర్వహించిన క్రికెట్ లీగ్ టోర్నమెంటులో ఎం.ఎం.సీ.ఏ రైడర్స్ జట్టు గెలుపొందింది. ఫైనల్ పోటీలో ఎం.ఎం.సి.ఏ రైడర్స్ జట్టు ఎం ఎం సి ఏ బ్లాస్టర్ జట్టును ఓడించింది. 18 ఓవర్ల మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన బ్లాస్టర్స్ జట్టు 16 ఓవర్లలో 93 పరుగులు చేసి ఆల్ అవుట్ కాగా రైడర్స్ జట్టు 16 ఓవర్లలో ఐదు వికెట్ల నష్టానికి 94 పరుగులు చేసి విజయం సాధించింది. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా అభి,మ్యాన్ ఆఫ్ ది సిరీస్‌గా శ్రీకాంత్ ఎంపిక అయ్యారు. బెస్ట్ బౌలర్‌గా చందు, బెస్ట్ బ్యాట్స్ మెన్ గా నవం ఎంపికయ్యారు. విజేతలకు సోమవారం రాత్రి కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకులు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ప్రచార కమిటీ నాయకులు నాతరి స్వామి మాట్లాడుతూ క్రికెట్ విజేతలకు శుభాకాంక్షలు తెలిపారు. క్రీడలకు తమ పార్టీ తగిన విధంగా ప్రోత్సాహం అందిస్తుందన్నారు. బెల్లంపల్లి పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు ముచ్చర్ల మల్లయ్య మాట్లాడుతూ బెల్లంపల్లిలో క్రికెట్ అభివృద్ధి కోసం మురళి మెమోరియల్ క్రికెట్ అకాడమీ ఎంతగానో కృషి చేస్తున్నదని ప్రశంసించారు. ప్రస్తుతం అద్దె స్థలంలో నిర్వహిస్తున్న అకాడమీకి ఎమ్మెల్యేతో సంప్రదించి తగిన ప్రభుత్వ స్థలాన్ని అందించడానికి కృషి చేస్తామన్నారు. ఈ బహుమతి ప్రధానోత్సవ కార్యక్రమంలో కెరీర్ గ్రూపు చైర్మన్ గడ్డం రాజేష్ గౌడ్, తెలంగాణ క్రికెటర్ అసోసియేషన్ మంచిర్యాల జిల్లా అధ్యక్షులు పైడిమల్ల నర్సింగ్, కో ఆర్డినేటర్ అల్లం వెంకటేశ్వర్లు, ఎస్‌జిఎఫ్ జోనల్ సెక్రెటరీ గోపాల్, ఒకేషనల్ కళాశాల ప్రిన్సిపాల్ రాజేష్, పి.డి బాబురావు, క్రికెట్ అకాడమీ కోచ్ డేవిడ్, యూత్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. ఎంపైర్లుగా గౌతం,హరీష్, దుర్గయ్య కామెంటేటర్ గా దినేష్ వ్యవహరించారు.

## మందమర్రి శ్రీ చైతన్య పాఠశాలలో హ్యాపీ క్లబ్ ఇన్ స్కూల్ కార్యక్రమం

**మందమర్రి, డిసెంబర్ 30, ప్రభాతవార్త**

మందమర్రి పట్టణ కేంద్రంలో గల శ్రీ చైతన్య పాఠశాలలో హ్యాపీ క్లబ్ కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ ఎమ్. రమేష్ మాట్లాడుతూ హ్యాపీ క్లబ్ ఇన్ స్కూల్ అంటే పాఠశాలలో విద్యార్థుల మానసిక ఉల్లాసం, సంతోషం మరియు సానుకూల దృక్పథాన్ని పెంపొందించడానికి ఏర్పాటు చేసే ఒక బృందం లేదా సంఘం అని అర్థం అని అన్నారు. విద్యార్థులకు చదువుల వల్ల కలిగే ఒత్తిడిని తగ్గించి, పిల్లలు ఉత్సాహంగా ఉండేలా చూడటం, విద్యార్థుల మధ్య స్నేహాన్ని, పరస్పర సహకారాన్ని పెంచడం, ఆటలు, పాటలు, కథలు చెప్పడం వంటి సరదా కార్యక్రమాలను నిర్వహించడం, విద్యార్థుల మనసుల్లో సానుకూల ఆలోచనలను నింపి వారి ఆత్మవిశ్వాసాన్ని పెంచడం, క్లుప్తంగా చెప్పాలంటే పాఠశాల వాతావరణాన్ని పిల్లలకు మరింత ఇష్టమైనదిగా, ఆనందమయంగా మార్చే వేదిక ఇది అని అన్నారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించినందుకు పాఠశాల యాజమాన్యం డైరెక్టర్ శ్రీవిద్య, చైర్మన్ మల్లంపల్లి శ్రీధర్, ఏజీఎం అరవిందరెడ్డి, కోఆర్డినేటర్ నాగరాజులు అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డీన్ రవి, ప్రైమరీ, ప్రీ ప్రైమరీ ఇన్చార్జీలు నూకల సునీత, తిరుమల, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



# పంట మార్పిడి విధానం ద్వారా అధిక దిగుబడి సాధ్యం

**- మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**



**నస్పూర్, డిసెంబర్ 30, ప్రభాతవార్త**

వ్యవసాయ సాగులో పంట మార్పిడి విధానం ద్వారా అధిక దిగుబడి సాధించవచ్చని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల సమావేశ మందిరంలో జిల్లా పశు వైద్య, పశుసంవర్ధక శాఖ అధికారి ఈ.శంకర్, జిల్లా వ్యవసాయ అధికారి సురేఖ, జిల్లా ఉద్యానవన అధికారి అనితలతో కలిసి డివిజన్, మండల వ్యవసాయ అధికారులు, వ్యవసాయ విస్తరణాధికారులు, ఉద్యానవన, పట్టు పరిశ్రమ శాఖ అధికారులు, పశు వైద్య పశుసంవర్ధక శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంచిర్యాల జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వ్యవసాయ సాగులో పంట మార్పిడి విధానం అవలంబించడం ద్వారా అధిక దిగుబడి సాధించి ఆర్థిక అభివృద్ధి చెందవచ్చని తెలిపారు. వరి, పత్తి, మొక్కజొన్న పంటలు మాత్రమే కాకుండా వాణిజ్య పంటలు, కూరగాయల సాగు, ఇతర ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులను ప్రోత్సహించాలని తెలిపారు. దేశ వ్యాప్తంగా వరి పంట సాగు విస్తీర్ణం అధిక మొత్తంలో ఉన్నందున రైతులు పంట మార్పిడి విధానాన్ని అవలంబించే విధంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. జిల్లాలో ఆయిల్ పామ్ పంట సాగుకు అనుకూల ప్రాంతాలను గుర్తించాలని, పంట సాగుతో కలిగే లాభాలపై రైతులకు వివరించి సాగు చేసే విధంగా ప్రోత్సహించాలని తెలిపారు. తద్వారా జిల్లాకు నిర్దేశించిన ఆయిల్ పామ్ సాగు విస్తీర్ణం పెంపొందుతుందని, రైతులకు ఆర్థికంగా లాభం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో నమోదు అయిన సాగు విస్తీర్ణానికి అవసరమైన యూరియా సమృద్ధిగా అందుబాటులో ఉందని, జిల్లాలో యూరియా పంపిణీ కేంద్రాలు ఏర్పాటు చేసి కార్యచరణ ప్రకారం అవసరమైన ప్రతి రైతుకు నిబంధనల ప్రకారం యూరియా అందించే విధంగా అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని తెలిపారు. వ్యవసాయ, ఉద్యానవన, పశు వైద్య పశుసంవర్ధక శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని, రైతు సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను అర్హత గల రైతులకు అందించేందుకు కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## వికసించిన చిట్టి చేతుల మానవత్వం..!

**- అనాథ వృద్ధుల కోసం విద్యార్థుల సేవా హృదయం**

**మందమర్రి, డిసెంబర్ 30, ప్రభాతవార్త**

మందమర్రి మండలం ఫిల్టర్ బెడ్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు మానవత్వానికి నిలువెత్తు నిదర్శనంగా నిలిచారు. చలికి వణుకుతూ రోడ్లపై, బస్టాండ్లలో జీవిస్తున్న అనాథ వృద్ధులను చూసి చలించిపోయిన ఈ చిన్నారులు, వారి కోసం జరుగుతున్న సేవా కార్యక్రమంలో భాగస్వాములయ్యారు. మీడియా అకాడమీ పాత్రికేయులు జనార్ధన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అనాథ వృద్ధులకు బ్లాంకెట్ల పంపిణీ కార్యక్రమానికి, విద్యార్థులు తమ చిట్టి చేతులతో విరాళాలు సేకరించి రూ. 2,500 నగదును అందజేశారు. ఈ మొత్తాన్ని వృద్ధులకు బ్లాంకెట్ల పంపిణీ కోసం వినియోగించనున్నారు. ఈ సందర్భంగా మానవ సేవయే మాధవ సేవ అన్న భావనను ఆచరణలో చూపిన చిన్నారులను ఉపాధ్యాయులు అభినందించారు. విద్యార్థుల్లో చిన్న వయసులోనే సేవాభావం, సమాజంపై బాధ్యత పెంపొందడం ప్రశంసనీయం అన్నారు. ఈ కార్యక్రమంలో పాత్రికేయులు జనార్ధన్‌తో పాటు ఉపాధ్యాయులు ఉమాదేవి, భీమ్ పుత్ర శ్రీనివాస్, లలిత, రవి, విద్యార్థులు పాల్గొన్నారు.




## పౌర హక్కులకు భంగం కలిగించరాదు

**వేమనపల్లి, డిసెంబర్ 30, ప్రభాతవార్త**

రాజ్యాంగం ద్వారా కల్పించిన పౌర హక్కులపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని ఆర్ఐ ఖాళిక్ అన్నారు. మండలంలోని ముల్కలపేట గ్రామపంచాయతీలోని రాచర్లలో తహసీల్దార్ సాయికృష్ణ ఆదేశాలతో మేరకు మంగళవారం పౌరహక్కుల దినోత్సవం నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం గ్రామస్తులచే ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆర్ఐ మాట్లాడుతూ పౌర హక్కులకు భంగం కలిగించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. కుల వివక్ష అంటరానితనాన్ని నిర్మూలించాలని అన్ని కులాలు వర్గాల వారు సోదర భావంతో మెలగాలని సూచించారు. హక్కులకు ఎలాంటి భంగం కలిగిన చట్టపరమైన చర్యలు ఉంటాయని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఒడిల కళ్యాణి సుధాకర్, ఉప సర్పంచ్ బోర్కుటి నరేష్, పంచాయతీ కార్యదర్శి సురేష్, కిరణ్, పున్నం, పోషం, శ్రీనివాస్, రమేష్, గ్రామస్థులు పాల్గొన్నారు.



## మృతుని కుటుంబానికి చేయూత

**పెంచికల్ పేట్, డిసెంబర్ 30, ప్రభాతవార్త :**

పెంచికల్ పేట్ మండలం ఎల్లూరు గ్రామానికి చెందిన రాచకొండ పోషన్న ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ దండే విఠల్ ఆదేశాల మేరకు మంగళవారం స్థానిక కాంగ్రెస్ నాయకులు మృతుడి కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సహాయాన్ని అందించారు. ఎమ్మెల్సీ దండే విఠల్ ఎల్లప్పుడూ కుటుంబానికి అండగా ఉంటారని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు చంద్రకాంత్, హనుమా గౌడ్, రవి, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.



## విద్యార్థులను తరలిస్తున్న ఆటోను ఢీ కొట్టిన బొలెరో ట్రాలీ

**లక్షెట్టిపేట, డిసెంబర్ 30, ప్రభాతవార్త**

పట్టణంలోని సిఎస్ఐ చర్చి గేటు ముందు స్కూల్ విద్యార్థులను తరలిస్తున్న ఆటోని బొలెరో ట్రాలీ ఢీకొనడంతో ఆరుగురు విద్యార్థులకు గాయాలయ్యాయి అని ఎస్ఐ గోపతి సురేష్ తెలిపారు. పట్టణానికి చెందిన రామస్వామి అనే ఆటో డ్రైవర్ తన ఆటోలో రోజు మాదిరిగా భగత్ సింగ్ నగర్‌కు చెందిన 9 మంది విద్యార్థులను లక్షెట్టిపేట పట్టణంలోని బాలికల పాఠశాల బాలుర పాఠశాలకు తరలిస్తుండగా సిఎస్ఐ చర్చ్ గేటు ముందు వైపు నుంచి ఆంధ్ర బోర్ వైపు వెళ్తున్న బొలెరో వాహనం ఢీకొనడంతో ఆటో రోడ్డు పక్కన ఉన్న కెనాల్‌లో పడిపోయింది. వెంటనే స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించి గాయపడ్డ విద్యార్థులను లక్షెట్టిపేట ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. ఇక్కడ ప్రథమ చికిత్స అనంతరం కొంతమందికి ఎక్కువ గాయాలు కావడంతో మంచిర్యాల ఆసుపత్రికి వైద్యుల సూచన మేరకు పంపించడం జరిగింది. ఆటో డ్రైవర్ రామస్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేయడం జరుగుతుంది.

## ముక్కోటి ఏకదశి ఉత్తర ద్వార దర్శనంతో పరవశించిన భక్తులు

**జైపూర్, డిసెంబర్ 30, ప్రభాతవార్త**

మంగళ వారం ఉత్తర ద్వార దర్శనంతో భక్త జనం పరవశించి పోయారు. మండలంలోని వేలాల గ్రామంలో సీతారామలక్ష్మణ సమేత ఆంజనేయ స్వామి ఆలయంలో ముక్కోటి ఏక దశి పర్వదినాన్ని పురస్కరించుకొని భక్తులకు ఉత్తరద్వార దర్శనం కల్పించారు. ఉదయం స్వామి వారి ఉత్సవ విగ్రహాలను భక్తుల భజన, ఒగ్గు వాయిద్యాల మధ్య పవిత్ర గోదావారి (గంగా) నదికి తీసుకెళ్లి వేదమంత్రలతో పంచామృతల స్నానం ఆచరించారు. అనంతరం స్వామివారి విగ్రహాలను ఆలయానికి తీసుకురాగా ఏకాదశి సందర్భంగా ఆలయానికి పెద్ద ఎత్తున భక్తులు తరలిరావచ్చారు. జైపూర్ మండల కేంద్రంలో శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో ప్రత్యేకంగా ఉత్తరద్వారాన్ని ఏర్పాటు చేసి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఈ కార్యక్రమంలో వేలాల గ్రామ సర్పంచ్ డేగ స్వప్న నగేష్, ఉప సర్పంచ్ సుందిల్ల రాజలింగు తదితరులు పాల్గొన్నారు.





క్యాలెండర్‌ను ఆవిష్కరించిన దృశ్యం

## వేలాలలో గిరి ప్రదక్షిణ క్యాలెండర్ ఆవిష్కరణ

**జైపూర్, డిసెంబర్ 30, ప్రభాతవార్త**

వేలాల గట్టు మల్లన్న ఆలయ గిరి ప్రదక్షిణకు సంబంధించినూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని రూపొందించిన నూతన క్యాలెండర్ పోస్టర్లను మంగళవారం ఆలయ కమిటీఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆధ్యాత్మిక జీవనంలో క్యాలెండర్‌కు ప్రత్యేక ప్రాధాన్యత ఉంటుందని అన్నారు. గట్టు మల్లన్న కొలువై ఉన్న గుట్ట చుట్టూ చేపడుతున్న గిరి ప్రదక్షిణ లాంటి ధార్మిక కార్యక్రమం మరింత విస్తృతంగా కొనసాగాలని ఆకాంక్ష వ్యక్తం చేశారు. భక్తులందరికీ శాంతి, సుఖసంతోషాలు కలిగించాలని స్వామివారిని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ డేగ స్వప్న నగేష్, రాజేష్ శర్మ, శశింధర్ యాదవ్, శ్రీనివాస్, సాయి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## బైక్ ఢీకొని వ్యక్తి మృతి

**లక్షెట్టిపేట, డిసెంబర్ 30, ప్రభాతవార్త**

లక్షెట్టిపేట మున్సి పాలిటీలోని గంపలపల్లి గ్రామానికి చెందిన రాందేని మల్లేష్ అనే 57 సంవత్సరాల వ్యక్తిని రాయల్ ఎన్ఫీల్డ్ బైకు ఢీకొని మృతి చెందినట్లు ఎస్సై గోపతి సురేష్ తెలిపారు. మృతుడు నిన్న సాయంత్రం తన ఇంటి నుండి కిరాణా సామాన్లు తేవడానికి వెళ్లి తిరిగి వస్తుండగా ఆంధ్ర బోర్ మహేంద్ర షోరూం ఎదురుగా కరీంనగర్ చౌరస్తా నుండి ఊట్కూర్ వైపు వస్తున్న రాయల్ ఎన్ఫీల్డ్ బైక్ నడుపుతున్న యుగేందర్ అనే వ్యక్తి తన బైక్ను అతివేగంగా జాగ్రత్తగా నడపక రోడ్డు పక్కన నడుచుకుంటూ వెళ్లే మల్లేష్‌ను వెనక నుండి ఢీకొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు, కుటుంబ సభ్యులు ఆయన్ను వెంటనే మంచిర్యాల మెడిలైవ్ ఆసుపత్రికి తరలించి అక్కడి వైద్యుల సూచన మేరకు కరీంనగర్ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలో నిన్న రాత్రి 9:30 గంటలకు చనిపోయాడు. మృతునికి భార్య ముగ్గురు పిల్లలు ఉన్నారు. భార్య రామ్ దేని సత్తవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేయడం జరుగుతుందనీ తెలిపారు.



# రోబోటిక్స్ ఎగ్జిబిషన్ విద్యార్థుల్లో సృజనాత్మకత, శాస్త్రీయ దృక్పథం పెంపొందిస్తుంది

**- సిర్పూర్ పేపర్ మిల్లు వైస్ ప్రెసిడెంట్ అమరేంద్ర కుమార్ మిశ్రా**

**- కాగజ్‌నగర్ జవహర్ నవోదయ విద్యాలయంలో ఆకట్టుకున్న రోబోటిక్స్ ఎగ్జిబిషన్ - 32 రోబోటిక్స్ మోడల్స్‌ను ప్రదర్శించిన విద్యార్థులు**



రోబోటిక్స్ గురించి వివరిస్తున్న విద్యార్థులు



రోబోటిక్స్ మోటల్స్‌ను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

కాగజ్‌నగర్ రూరల్, డిసెంబర్ 30, ప్రభాతవార్త :

రోబోటిక్స్ ఎగ్జిబిషన్ విద్యార్థుల్లో సృజనాత్మకత, శాస్త్రీయ దృక్పథం పెంపొందిస్తుందని సిర్పూర్ పేపర్ మిల్లు వైస్ ప్రెసిడెంట్ అమరేంద్ర కుమార్ మిశ్రా అన్నారు. కాగజ్‌నగర్‌లోని పి.ఎం. శ్రీ జవహర్ నవోదయ విద్యాలయంలో విద్యార్థుల ఆధ్వర్యంలో నిర్వహించిన రోబోటిక్స్ ఎగ్జిబిషన్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా అమరేంద్ర కుమార్ మిశ్రా మాట్లాడుతూ రోబోల ప్రాముఖ్యతపై వివరించారు. రోబోలు స్వయంగా ఆలోచించలేవని, రోబోలు పనిచేయడానికి కారణం మానవులే, రోబోలకు మెదడు మానవులేనని తెలిపారు. మానవులు ఎలా రూపకల్పన చేస్తే రోబోలు అదే విధంగా పనిచేస్తాయని వివరించారు. రోబోల ఉపయోగం వ్యవసాయ రంగంలో, కర్మాగారాలలో, వైద్య చికిత్సలు, నిర్వహణ రంగాలలో విస్తృతంగా ఉందని తెలిపారు. కొన్ని సందర్భాల్లో మనుషులు చేయలేని క్లిష్టమైన పనులను కూడా రోబోలు సమర్థవంతంగా నిర్వహిస్తున్నాయని పేర్కొన్నారు. ఎగ్జిబీషన్‌లో విద్యార్థులు స్వయంగా రూపొందించిన 32 రోబోటిక్స్ మోడల్స్‌ను ప్రదర్శించి సందర్శకుల ప్రశంసలు అందుకున్నారు. ఈ కార్యక్రమాన్ని డిగ్రీ కళాశాల విద్యార్థులు, ఈఎంఆర్ఎస్ విద్యార్థులు సందర్శించి మంచి స్ఫూర్తిని పొందారు. అనంతరం విద్యాలయ భౌతిక శాస్త్ర అధ్యాపకులు ఐలయ్య మాట్లాడుతూ పి.ఎం. శ్రీ నిధుల ద్వారా ఇలాంటి కార్యక్రమాలను రూపకల్పన చేయడం వల్ల విద్యార్థుల్లో సృజనాత్మకత, శాస్త్రీయ దృక్పథం పెంపొందడంతో పాటు కొత్త ఆవిష్కరణలకు మార్గం సుగమమవుతుందని తెలిపారు. ఈ రోబోటిక్స్ ఎగ్జిబిషన్ విద్యార్థుల్లో శాస్త్రీయ ఆలోచనలను పెంపొందించడంతో పాటు భవిష్యత్ సాంకేతిక నైపుణ్యాల అభివృద్ధికి ఎంతో దోహదపడుతుందని అతిథులు అభినందించారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎస్పీయం వైస్ ప్రెసిడెంట్ అమరేంద్ర కుమార్ మిశ్రాను కాగజ్‌నగర్ నవోదయ ప్రిన్సిపల్ రేపాల కృష్ణతో పాటు పలువురు శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పేపర్ మిల్ జనరల్ మేనేజర్ సురేంద్ర నార్కడే, గౌరవ అతిథులుగా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ చెన్నూరు శ్రీదేవి, ఉప ప్రధానాచార్యులు లక్ష్మీనారాయణ, డిగ్రీ కళాశాల సీనియర్ అధ్యాపకులు జనార్ధన్, ఈఎంఆర్ఎస్ ప్రిన్సిపల్ కనిక వర్మ, నవోదయ విద్యాలయ అధ్యాపకులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.



## రైతులకు అందుబాటులో సరిపడా యూరియా

**- మండల వ్యవసాయ అధికారి ఆర్ శ్రీకాంత్**

లక్షెట్టిపేట, డిసెంబర్ 30, ప్రభాతవార్త

రైతులకు సరిపడా యూరియా అందుబాటులో ఉందని మండల వ్యవసాయ అధికారి ఆర్. శ్రీకాంత్ తెలిపారు. మంగళవారం రోజున రైతు నేస్తం కార్యక్రమంలో భాగంగా మంచిర్యాల డివిజన్ వ్యవసాయ సంచాలకులు ఎం. కృష్ణ సూరారం రైతు వేదికలో రైతులతో మాట్లాడుతూ... రైతులు వరికి బదులుగా ప్రత్యామ్నాయ పంటలకు మొగ్గు చూపాలని, మొక్కజొన్న, నువ్వులు, పెసర, ఆయిల్ ఫామ్ వంటి పంటలు సాగు చేయాలని, దీని ద్వారా రైతుల ఆదాయం పెరుగుతుందని తెలిపారు. పంట మార్పిడి విధానాన్ని రైతులు అవలంబించాలని తెలిపారు. మంచిర్యాల డివిజన్ పరిధిలో ఈ యాసంగి సీజన్లో 55400 ఎకరాల్లో వరి ,600 ఎకరాల్లో మొక్కజొన్న నువ్వులు, అదేవిధంగా కూరగాయలు 200 ఎకరాలు, ఆయిల్ ఫామ్ 730 ఎకరాలు, మామిడి 950 ఎకరాలు, ఇతర పంటలు 360 ఎకరాలు, మొత్తంగా కలిపి 63400 ఎకరాలకు గాను సాగు ప్రణాళిక కు 8400 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం ఉంటుందని తెలిపారు. పంట సాగుకు అనుగుణంగా యూరియాలో ఎలాంటి అవాంతరాలు లేకుండా సరఫలం చేయడం జరిగిందని తెలిపారు. ప్రస్తుతం1500 ఎకరాల్లో వరి నాటు వేయడం జరిగిందని, 6000 ఎకరాల్లో మొక్కజొన్న సాగులో ఉందని, వీటికి సరిపడా యూరియా ప్రవేట్, సొసైటీలలో అందుబాటులో ఉందని తెలిపారు. అనంతరం కూరగాయలు, పూల తోటలో సందర్శించి రైతులను అభినందించి ఆదిక లాభం పొందాలని కోరారు. ఇట్టి కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఆర్. శ్రీకాంత్, ఏ ఈ ఓ ఇర్ఫాన యాస్మిన్, రైతులు సత్యనారాయణ రెడ్డి, మహేష్ రెడ్డి, మల్లారెడ్డి, పోశెట్టి, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఆపరేషన్ స్మైల్ 12 విజయవంతం కోసం జిల్లా స్థాయి సమన్వయ సమావేశం

మంచిర్యాల, డిసెంబర్ 30, ప్రభాతవార్త

రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఆదేశాల మేరకు ఆపరేషన్ స్మైల్ 12 అమలుకు సంబంధించి సంబంధిత విభాగాల అధికారులు డి.డబ్ల్యూ.ఓ, డీసీపీయూ, సీడబ్ల్యుసీ, కార్మిక, ఆరోగ్య, విద్యా శాఖలు, పోలీస్ సిబ్బందితో జిల్లా స్థాయి సమన్వయ సమావేశాలు నిర్వహించారు. మంచిర్యాల డీసీపీ ఏ. భాస్కర్ అధ్యక్షతన డీసీపీ కార్యాలయం, మంచిర్యాలలో సమావేశం నిర్వహించగా, ఈ సమావేశాల్లో రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని మంచిర్యాల, బెల్లంపల్లి, జైపూర్, పెద్దపల్లి జోన్ (పెద్దపల్లి, గోదావరిఖని సబ్ డివిజన్) ప్రాంతాలలో 18 సంవత్సరాల లోపు తప్పిపోయిన బాలురు, బాలికలు ఉన్నట్లయితే వారి సమాచారాన్ని సేకరించి, గుర్తించిన అనంతరం వారి తల్లిదండ్రులకు అప్పగించి కౌన్సిలింగ్ చేయాలని ఆదేశించారు. అలాగే బాలకార్మికులు, బిక్షాటనలో ఉన్న పిల్లలు, వదిలివేయబడ్డ పిల్లలను గుర్తించి వారి తల్లిదండ్రులకు అప్పగించాలని, బలవంతంగా బిక్షాటన చేయించిన వారిపై, వెట్టి చాకిరి చేయించిన వారిపై తగిన క్రిమినల్ కేసులు నమోదు చేయాలని సూచించారు. ఈ నేపథ్యంలో జనవరి 1 నుండి జనవరి 31 వరకు ప్రత్యేకంగా"ఆపరేషన్ స్మైల్ 12" కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతి డివిజన్ పరిధిలో ఒక ఎస్.ఐ స్థాయి అధికారిని నియమించి, ఆయన ఆధ్వర్యంలో నలుగురు సిబ్బంది మరియు ఒక మహిళా కానిస్టేబుల్‌ను నియమిస్తారని, వీరు సేకరించిన సమాచారాన్ని పోలీస్ కమిషనరేట్ స్థాయిలో సమగ్రంగా సమీకరించి, హైదరాబాద్‌లోని మహిళా భద్రతా విభాగం అధికారులకు తెలియజేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి ప్రజలు సహకరించాలని, తమ పరిసరాల్లో తప్పిపోయిన బాలురు, బాలికలు ఉన్నా, లేదా బాలకార్మికుల గురించి ఏవైనా సమాచారం ఉన్నా, దిగువన తెలియజేయబడిన ఫోన్ నంబర్లకు సమాచారం అందించాలని పోలీస్ శాఖ విజ్ఞప్తి చేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీసీపీ పోలీసు ఉన్నతాధికారులు




బాధ్యతలు స్వీకరిస్తున్న ఎస్.ఐ భూమేష్

## రామకృష్ణాపూర్ ఎస్.ఐగా భూమేష్ బాధ్యతల స్వీకరణ

రామకృష్ణాపూర్, డిసెంబర్ 30, ప్రభాతవార్త

పట్టణ నూతన ఎస్.ఐగా లింగంపల్లి భూమేష్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. గోదావరిఖని 1 టౌన్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఆయన బదిలీ పై వచ్చారు. ఇక్కడ ఎస్.హెచ్.ఓ గా విధులు నిర్వహించిన రాజశేఖర్ ట్రాన్స్ఫర్ అయి రామగుండం కమిషనరేట్ కు వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ న్యూ ఇయర్ వేడుకల పేరుతో చట్ట నిబంధనలను అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. 31 నేటి రాత్రి పట్టణంలో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ప్రత్యేక బందోబస్తు, పటిష్ట నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పట్టణంలోని ప్రధాన రహదారులు, కూడళ్ల వద్ద నిరంతరం డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తామని తెలిపారు. మద్యం సేవించి వాహనం నడిపితే ఉపేక్షించేది లేదని, వాహనాలను సీజ్ చేసి, క్రిమినల్ కేసులు నమోదు చేయడంతో పాటు, డ్రైవింగ్ లైసెన్సులు రద్దు చేయుటకు రవాణా శాఖకు సిఫార్సు చేస్తామని హెచ్చరించారు. బహిరంగ ప్రదేశాల్లో, రహదారులపై మద్యం సేవించడం చట్టరీత్యా నేరమని, అటువంటి వారిని వెంటనే అరెస్ట్ చేస్తామని తెలిపారు. నూతన సంవత్సర వేడుకలను కుటుంబ సభ్యులతో శాంతియుతంగా, ఆనందంగా జరుపుకోవాలని సూచించారు.

## రబీ సాగుపై రైతులకు అవగహన

**- యూరియా యాప్‌పై ప్రత్యేక శిక్షణ**

పెంచికల్ పేట్, డిసెంబర్ 30, ప్రభాతవార్త :

మండలంలోని చెడ్వాయి రైతు వేదికలో మంగళవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులకు యూరియా యాప్ పై అవగహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి రామకృష్ణ పాల్గొని రైతులకు రబీ సీజన్ సాగుపై కీలక సూచనలు చేశారు. రైతులు యూరియా యాప్ పై పూర్తి స్థాయిలో అవగహన కలిగి ఉండాలన్నారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ రైతులు వరి కొయ్యలను కాల్చవద్దని, పంట మార్పిడి విధానాన్ని అనుసరించాలని సూచించారు. రబీ సీజన్ లో అవసరమైన ఎరువులు, విత్తనాలు సమృద్ధిగా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. సబ్సిడీ పైన వ్యవసాయ యంత్రిక పరికరాలు అందుబాటులో ఉన్నాయని రైతులు మండల వ్యవసాయ అధికారి, వ్యవసాయ విస్తరణ అధికారికి దరఖాస్తూ చేసుకోవాలని తెలిపారు. అనంతరం మండలంలోని ఎరువుల దుకాణాలను తనిఖీ చేసి రైతులకు స్టాక్ వివరాలు స్పష్టంగా కనిపించేలా స్టాక్ బోర్డులు ఏర్పాటు చేయాలని డీలర్లకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ గౌసియా, రైతులు పాల్గొన్నారు.



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏవో రామకృష్ణ



# పులుల సంచారం నేపథ్యంలో చెక్ పోస్టుల నిర్మాణం చేపట్టాలని డిమాండ్

- భద్రతా సిబ్బందికి తగిన రక్షణ వసతులు కల్పించాలి
- శ్రీరాంపూర్ ఓపెన్ కాస్ట్ ప్రాజెక్ట్ అధికారికి బీఎంఎస్ వినతి

**నస్పూర్, డిసెంబర్ 30, ప్రభాతవార్త**

శ్రీరాంపూర్ ఏరియాలోని రక్షణ విభాగం, ఓపెన్ కాస్ట్ ఆవరణలో విధులు నిర్వహిస్తున్న భద్రతా సిబ్బందికి తగిన రక్షణ సౌకర్యాలు కల్పించాలని ఎస్సీఎంకెఎస్-బీఎంఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం శ్రీరాంపూర్ ఓపెన్ కాస్ట్ ప్రాజెక్ట్ అధికారి సిహెచ్. వెంకటేశ్వర్లును కలిసి నాయకులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్సీఎంకెఎస్-బీఎంఎస్ నాయకులు మాట్లాడుతూ.. సింగరేణి సంస్థ ఆస్తులను పరిరక్షించడంలో రక్షణ విభాగం ఉద్యోగులు కీలక పాత్ర పోషిస్తున్నారని, అయితే వారికి కనీస సౌకర్యాలు కల్పించడంలో యాజమాన్యం విఫలమైందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎండ, వాన, చలి వంటి వాతావరణ పరిస్థితుల నుండి రక్షణ పొందేందుకు అనువైన షెల్టర్ గదులు లేక సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ముఖ్యంగా శ్రీరాంపూర్ ఏరియాలో ప్రస్తుతం పులుల సంచారం ఎక్కువగా ఉన్నందున, రాత్రి సమయాల్లో విధులు నిర్వర్తించే సిబ్బంది ప్రాణాలకు ముప్పు పొంచి ఉందని, తక్షణమే పటిష్టమైన చెక్ పోస్టులను ఏర్పాటు చేయాలని కోరారు. శ్రీరాంపూర్ ఓపెన్ కాస్ట్ పరిధిలోని శాండ్ బంకర్ వద్ద, రామారావు పేట, బోర్వెల్ పాయింట్ల వద్ద వెంటనే రక్షణ షెల్టర్లు, చెక్ పోస్టుల నిర్మాణం చేపట్టాలని నాయకులు డిమాండ్ చేశారు. దీనిపై ప్రాజెక్ట్ అధికారి సిహెచ్. వెంకటేశ్వర్లు సానుకూలంగా స్పందిస్తూ, సిబ్బందికి రక్షణతో కూడిన వసతులు కల్పిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం ఏరియా సెక్యూరిటీ అధికారి జక్కా రెడ్డితో కూడా వివిధ సమస్యలపై చర్చించగా, సానుకూల పరిష్కారం చూపుతామని ఆయన భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీఎంఎస్ ఏరియా ఉపాధ్యక్షులు నాతాడి శ్రీధర్ రెడ్డి, ఏరియా సెక్రటరీ రాగం రాజేందర్, ఆర్గనైజింగ్ సెక్రటరీ జల్లా తిరుపతి పాల్గొన్నారు. వీరితో పాటు పిట్ సెక్రటరీలు నాగార్జున నాయక్, కొమ్మ బాపు, నాయకులు చొప్పరి శ్రీకాంత్, నీరటి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో ఉమ్మడి ఆదిలాబాద్ జట్టుకు స్వర్ణ పతకం

**నస్పూర్, డిసెంబర్ 30, ప్రభాతవార్త**

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయిలో నిర్వహించిన హ్యాండ్‌బాల్ పోటీల్లో ఉమ్మడి ఆదిలాబాద్ 14 ఏళ్ల లోపు బాలికల జట్టు అద్భుత ప్రతిభ కనబరిచి బంగారు పతకాన్ని కైవసం చేసుకుంది. ఈ నెల 28, 29 తేదీలలో సూర్యాపేట, మహబూబ్ నగర్‌లలో జరిగిన రాష్ట్రస్థాయి ఎంపిక పోటీలు, టోర్నమెంట్‌లో ఈ జట్టు విజేతగా నిలిచింది. ఈ విజేత జట్టులో సభ్యురాలైన నస్పూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 9వ తరగతి విద్యార్థిని ఎరికిల్ల దేవర్షిణిని మంచిర్యాల స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. జిల్లా విద్యాశాఖాధికారి యాదయ్య ముఖ్య అతిథిగా విచ్చేసి దేవర్షిణిని శాలువాతో సత్కరించి, అభినందనలు తెలిపారు. విద్యార్థులు క్రీడల్లో రాణించి జిల్లాకు పేరు తీసుకురావడం గర్వకారణమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి ఎండీ యాకుబ్, ఎస్ ఓ సత్యనారాయణ మూర్తి, సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయులు సిరంగి గోపాల్, గాజుల శ్రీనివాస్, రేణి రాజయ్య, సుదర్శన్, కొండగుర్ల విఠల్, పున్నం సాంబమూర్తి పాల్గొన్నారు. అలాగే హ్యాండ్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షులు గోనె శ్యామ్ సుందర్ రావు, కోశాధికారి రమేష్ రెడ్డి, రాజలింగు, మంచిర్యాల బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు బండి రమేష్, నస్పూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు సూరెడ్డి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# నూతన సంవత్సరం వేడుకలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలి

★ ఎస్పీ నితికా పంత్

**ఆసిఫాబాద్, డిసెంబర్ 30, ప్రభాతవార్త :**

కుమురంభీమ్ వ్యాప్తంగా నూతన సంవత్సరం వేడుకలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని జిల్లా ఎస్పీ నితికా పంత్ మంగళవారం ప్రజలకు విజ్ఞప్తి చేశారు. డిసెంబర్ 31 సాయంత్రం నుంచి నూతన సంవత్సరం సందర్భంగా జిల్లా వ్యాప్తంగా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే వాహనాలను సీజ్ చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అదేవిధంగా ట్రిపుల్ రైడింగ్, రాంగ్ సైడ్ డ్రైవింగ్, రాష్ డ్రైవింగ్, స్పీడ్ రేసింగ్ వంటి చర్యలు చట్ట విరుద్ధమని స్పష్టం చేశారు. మైనర్లు వాహనాలు నడిపితే వారిపై మాత్రమే కాకుండా వారి తల్లిదండ్రులపై కూడా కేసులు నమోదు చేస్తామని తెలిపారు. రోడ్లపై కేక్ కటింగ్ చేయడం, టపాకాయలు వెలిగించడం, బైక్ రేసింగ్‌లు నిర్వహించడం చట్టప్రకారం నేరమని, అటువంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని పేర్కొన్నారు. నూతన సంవత్సరం సందర్భంగా డీజేలకు ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతులు లేవని స్పష్టం చేశారు. అనుమతులు లేకుండా



బహిరంగ ప్రోగ్రాములు, ర్యాలీలు, సభలు, సమావేశాలు, ఈవెంట్లు నిర్వహించరాదని హెచ్చరించారు. సౌండ్ బాక్స్‌లు, మైక్ సిస్టంలతో కార్యక్రమాలు నిర్వహించాలంటే తప్పనిసరిగా పోలీస్ అనుమతులు తీసుకోవాలని సూచించారు. జిల్లావ్యాప్తంగా ప్రస్తుతం 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉందని తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తూ ప్రజలకు ఇబ్బందులు కలిగించే వారిపై కూడా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. శాంతి భద్రతల పరిరక్షణ కోసం జిల్లా పోలీసు యంత్రాంగం పటిష్ట చర్యలు చేపట్టిందని వెల్లడించారు. నూతన సంవత్సర శుభాకాంక్షల పేరుతో సైబర్ నేరగాళ్లు ఫేక్ లింకులు పంపి మోసాలకు పాల్పడే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. యువతతో పాటు ప్రజలంతా పోలీసుల సూచనలు పాటిస్తూ, ఇతరులకు ఇబ్బంది కలగకుండా నూతన సంవత్సరం వేడుకలను బాధ్యతాయుతంగా జరుపుకోవాలని విజ్ఞప్తి చేశారు.

# క్రీడా పోషకుడు సత్యనారాయణ సేవలు చిరస్మరణీయం

- శ్రీరాంపూర్ జనరల్ మేనేజర్ మునిగంటి శ్రీనివాస్ ప్రశంస - ఎస్వోటు జీఎంకు ఘనంగా సన్మానం

**నస్పూర్, డిసెంబర్ 30, ప్రభాతవార్త**

శ్రీరాంపూర్ ఏరియాలో క్రీడల అభివృద్ధికి, మౌలిక సదుపాయాల కల్పనకు ఎస్వోటు జీఎం ఎన్. సత్యనారాయణ అందించిన సేవలు వెలకట్టలేనివని ఏరియా జనరల్ మేనేజర్ మునిగంటి శ్రీనివాస్ కొనియాడారు. శ్రీరాంపూర్ ఏరియాలో సుదీర్ఘకాలం సేవలందించి, త్వరలో పదవీ విరమణ పొందనున్న సత్యనారాయణను మంగళవారం కంపెనీ స్థాయి క్రీడా పోటీల వేదికగా జనరల్ మేనేజర్ మునిగంటి శ్రీనివాస్ ఘనంగా సన్మానించారు. క్రీడాకారులు, క్రీడా సంఘ ప్రతినిధులతో కలిసి ఆయనకు శాలువా కప్పి, ప్రత్యేక క్రీడా మెమొంటోను అందజేశారు. ఈ సందర్భంగా జనరల్ మేనేజర్ మాట్లాడుతూ.. సత్యనారాయణ క్రీడల పట్ల ప్రత్యేక ఆసక్తితో ఏరియాలోని క్రీడాకారులను నిరంతరం ప్రోత్సహించారని తెలిపారు. ఆయన మార్గదర్శకత్వంలో శ్రీరాంపూర్ ఏరియా క్రీడాకారులు సింగరేణి స్థాయిలోనే కాకుండా, కోల్ ఇండియా స్థాయి పోటీల్లోనూ ప్రథమ స్థానాలు సాధించి సంస్థకు పేరు తెచ్చారని గుర్తు చేశారు. యువ క్రీడాకారులను గుర్తించి, వారికి అవసరమైన వేదికలు, వనరులు కల్పించడంలో ఆయన ఎల్లప్పుడూ ముందున్నారని ప్రశంసించారు. ఆయన అందించిన సేవలు శ్రీరాంపూర్ క్రీడా చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయని, భవిష్యత్ తరాలకు ఆయన ఒక ప్రేరణ అని పేర్కొన్నారు. ఈ సన్మాన కార్యక్రమంలో గుర్తింపు సంఘం అసిస్టెంట్ బ్రాంచ్ సెక్రటరీ మోత్కూరి కొమురయ్య, డీజీఎం (పర్సనల్), చీఫ్ కోఆర్డినేటర్ ఎస్. అనిల్ కుమార్, ఆర్.కె-5 గని ఏజెంట్ శ్రీధర్, డిప్యూటీ సిఎంఓ డాక్టర్ పి. రమేష్ బాబు, స్పోర్ట్స్ సెక్రటరీ సృజన్ పాల్, స్పోర్ట్స్ సూపర్వైజర్ చాట్ల అశోక్, జాన్ వెస్లీ, పర్సా శ్రీనివాస్, ఎం. నరేందర్ రెడ్డి, సిహెచ్ రమేష్, వివిధ ఏరియాల కోఆర్డినేటర్లు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.




ఎస్వోటు జీఎంను శాలువాతో సన్మానించి మెమొంటో అందజేస్తున్న దృశ్యం

# ఉత్పత్తి-ఉత్పాదకతలో కార్మిక సంఘాల పాత్ర కీలకం

- కార్మిక సమస్యల పరిష్కారానికి జీఎం హామీ

**మందమర్రి, డిసెంబర్ 30, ప్రభాతవార్త**



మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ ఎన్. రాధాకృష్ణ అధ్యక్షతన గుర్తింపు సంఘం (ఏఐటీయూసీ)తో 13వ స్ట్రక్చర్ మీటింగ్ మంగళవారం మందమర్రి జనరల్ మేనేజర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించారు. ఈ సమావేశంలో సింగరేణి కార్మికులకు సంబంధించిన పలు సమస్యలపై విస్తృతంగా చర్చ జరిగింది. గుర్తింపు కార్మిక సంఘం ఏఐటీయూసీ తరఫున మందమర్రి బ్రాంచ్ సెక్రటరీ సలేంద్ర సత్యనారాయణ, బెల్లంపల్లి బ్రాంచ్ సెక్రటరీ దాగం మల్లేష్‌తో పాటు యూనియన్ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జీఎం ఎన్. రాధాకృష్ణ మాట్లాడుతూ, సంస్థ అభివృద్ధిలో ఉత్పత్తి-ఉత్పాదకత పెంపులో కార్మిక సంఘాల పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. సింగరేణి సంస్థ ఉత్పత్తితో పాటు ఉద్యోగుల సంక్షేమానికి కూడా సమాన ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. గత సమావేశంలో చర్చించిన అంశాల పురోగతిపై సమీక్ష జరిపిన జీఎం, గుర్తింపు సంఘం నాయకులు ప్రస్తావించిన సమస్యలను పరిష్కరించాల్సిందిగా సంబంధిత అధికారులను ఆదేశించారు. ఇప్పటివరకు ఉత్పత్తి లక్ష్య సాధనలో సహకరించిన విధంగానే భవిష్యత్తులో కూడా సహకారం కొనసాగించాలని యూనియన్ నాయకులను కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓటు జీఎం జీ.ఎల్. ప్రసాద్, డీజీఎం పర్సనల్ అశోక్, డీజీఎం ఐఈడీ కిరణ్ కుమార్, ఏరియా ఇంజనీర్ ఈ అండ్ ఎం బాలాజీ భగవతి, ఏరియా స్టోర్స్ డీజీఎం ఈ అండ్ ఎం సురేష్, సివిల్ ఎస్ఈ రాము, కే.కే గ్రూప్ ఏజెంట్ రాంబాబు, కేకే ఓసీ ప్రాజెక్ట్ ఆఫీసర్ మల్లయ్య, రామకృష్ణాపూర్ ఏరియా హాస్పిటల్ డీవైసీఎంఓ డా. మధుకుమార్, కే.కే డిస్పెన్సరీ మెడికల్ సూపరింటెండెంట్ నాగేశ్వరరావు, డీవైపీఎం సందీప్, రామకృష్ణాపూర్ బ్రాంచ్ సెక్రటరీ అక్బర్ అలీ, ఏఐటీయూసీ మందమర్రి వైస్ ప్రెసిడెంట్ సుదర్శనం, సీనియర్ నాయకులు కంది శ్రీనివాస్, స్ట్రక్చర్ కమిటీ మెంబర్ సి.వి. రమణతో పాటు పలువురు అధికారులు, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.